డివిజన్లు.. సరిహద్దులపై టెన్షన్

నేడు తుది జాబితా విడుదల • పది డివిజన్లలో భారీగా మార్పులు

కార్పొరేషన్, జూన్ 20 : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో డివిజన్ల పునర్విభజన ప్రక్రియ చేపట్టగా, వాటి సరిహద్దుల విషయంలో నగర నేతల్లో టెన్షన్ నెలకొన్నది. ఇప్పటికే ముసాయిదా విషయంలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన అధికారులు తుది జాబితాను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. దీనిపై ప్రభుత్వ స్థాయిలో చర్చలు సాగుతున్నట్లు తెలుస్తున్నది. వీటి అనంతరం తుది జాబితాను శనివారం ప్రభుత్వం విడుదల చేయనున్నది. దీంతో ఏయే డివిజన్ల సరిహద్దులు ఏమేరకు మారుతాయన్న ఉత్కంఠ ఏర్పడింది.

ఇప్పటికే డివిజన్ల నంబర్లు మారినట్లు ప్రచారం సాగుతున్నది. ముసాయిదా విడుదల సమయంలో అప్పటి అధికారులు తీగలగుట్టపల్లిని నార్త్ ఈస్ట్ ప్రాంతంగా చేసుకొని డివిజన్ల పునర్విభజన చేపట్టారు. అయితే దీనిపై పలువురు ప్రస్తుతం విలీన గ్రామాలను కలుపుకొంటే నార్త్ ప్రాంతం ఆరెపల్లి అవుతుందని.. తీగలగుట్టపల్లిని ఎలా పరిగణనిస్తారన్న విమర్శలు వచ్చాయి. దీంతో నగరపాలక ఉన్నతాధికారులు ఆరెపల్లి కేంద్రంగా పునర్విభజన డివిజన్లను చేపట్టినట్లు సమాచారం. దీని ప్రకారం ఆరెపల్లి ప్రాంతం మొదటి డివిజన్‌గా మారగా టవర్‌సర్కిల్ చివరి డివిజన్‌గా మారినట్లు తెలుస్తున్నది. దీంతో ముసాయిదాలో ఇచ్చిన డివిజన్ల సంఖ్య పూర్తిగా మారినట్లు సమాచారం.

పది డివిజన్లలో మార్పులు

నగరపాలక సంస్థలో 66 డివిజన్లకు సంబంధించి ముసాయిదా విడుదల చేయగా, వీటిలో పది నుంచి పదిహేను డివిజన్ల మ్యాపింగ్‌కు, ప్రకటించిన ఇంటి నంబర్లకు మధ్య పొంతన లేకుండా పోయింది. దీంతో ఆయా డివిజన్ల ఓటర్ల సంఖ్య.. ఇళ్ల సంఖ్య పరిగణనలోకి తీసుకున్నా కూడా మార్పులు చేర్పులు తప్పలేదని తెలుస్తున్నది. దీంతో ఆయా డివిజన్లు సర్దుబాటు పక్రియలో ఆ డివిజన్ల పరిసరాల్లోని డివిజన్ల సరిహద్దులు, ఓటర్ల సంఖ్యలోనూ మార్పులు చేర్పులు జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా నగరంలో నూతనంగా విభజించిన 10 డివిజన్లలో ముసాయిదాతో పోల్చితే భారీగానే సరిహద్దులను మార్చినట్లుగా తెలుస్తున్నది. ఈ క్రమంలో వాటి చుట్టూ ఉన్న రెండు డివిజన్లలోనూ మార్పులు జరిగినట్లుగా సమాచారం. అయితే కొన్ని డివిజన్లలో మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు నాయకుల కన్నుసన్నల్లోనే అధికారులు మార్పులు చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల మేరకు డివిజన్ల విభజన లేకపోతే కోర్టులను ఆశ్రయిస్తామని ఇప్పటికే పలువురు నాయకులు పేర్కొంటున్నారు.

ఒలింపిక్ స్ఫూర్తిని కొనసాగించాలి

అంబేద్కర్ స్టేడియంలో ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభించి రన్‌లో పాల్గొన్న శాట్ చైర్మన్

- వచ్చే ఏడాది అందుబాటులోకి స్పోర్ట్స్ వర్సిటీ
- శాట్ చైర్మన్ శివసేనారెడ్డి

కొత్తపల్లి, జూన్ 20 : క్రీడలపై అవగాహన కల్పిస్తూ పతకాల సాధనే లక్ష్యమైన ఒలింపిక్ స్ఫూర్తిని యువతలో రగిలించాలని, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీల సంయుక్తాధ్వర్యంలో కరీంనగర్‌లో శుక్రవారం ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తే వారి పేరును మైదానాలకు పెడుతామని వెల్లడించారు. వచ్చే ఏడాది స్పోర్ట్ వర్సిటీ కూడా అందుబాటులోకి వస్తుందని, కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు మంత్రి పొన్నం రూ.25లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలో శిక్షణ పొంది రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులు టార్చ్‌ను వెలిగించి క్రీడా జ్యోతి చేతబూని రన్ ప్రారంభించారు. అంబేద్కర్ స్టేడియం, భగత్‌నగర్, కలెక్టరేట్, తెలంగాణ చౌక్ నుంచి తిరిగి స్టేడియం వరకు ఈరన్ ఉత్సాహంగా కొనసాగింది. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎన్‌సీసీ కమాండెంట్ అధికారి కల్నల్ జయంత్, ఏవో కల్నల్ కృష్ణ, ఆర్డీవో మహేశ్వర్, డీవైఎస్‌వో శ్రీనివాస్, డీఈవో శ్రీరాం మొండయ్య, ఎస్ఆర్ఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, పెటా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, శంకరయ్య, ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, పలు క్రీడా సంఘాల బాధ్యులు, జిల్లా ప్రైవేట్ పీఈటీల సంఘం బాధ్యులు, స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఆర్మీ బెటాలియన్, ఎన్‌సీసీ కెడెట్లతో పాటు వెయ్యి మంది ఒలింపిక్ రన్‌లో పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల తనిఖీ

ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న అనంతరం కరీంనగర్ మానేరు సమీపంలోని క్రీడా పాఠశాలను శాట్ చైర్మన్ శివసేనారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలల్లో నీటి శాతం ఎక్కువగా ఉండడం, పరిశుభ్రత లోపించడంతో కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డితో పాటు డీవైఎస్‌వో వీ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కేంద్రమంత్రి పరామర్శ

భూంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బండి సంజయ్

విద్యానగర్, జూన్ 20: ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ సీహెచ్. రవీందర్ రావు ఇటీవల మృతిచెందగా, బోయినపల్లి మండలం కోరెం గ్రామంలో ఆయన కుటుంబాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు కరీంనగర్‌లో ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన డాక్టర్ భూంరెడ్డి నివాసానికి వెళ్లి, ఆయన కుమారుడితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. డాక్టర్ భూంరెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

రైతుల ఖాతాల్లో రూ. 165 కోట్ల పెట్టుబడి సాయం జమ

కరీంనగర్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లాలో నాలుగు రోజులుగా రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి జే భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించామని, ఆ రోజు పెద్ద మొత్తంలో 1,24,727 మంది రైతులకు రూ. 65 కోట్ల 79 లక్షల 92 వేల 748, 17న 27,307 మంది రైతులకు రూ. 40 కోట్ల 25 లక్షల 18 వేల 477, 19న 15,995 మంది రైతులకు రూ.32 కోట్ల 91 లక్షల 15 వేల 728, శుక్రవారం 9,995 మంది రైతులకు రూ. 26 కోట్ల 39 లక్షల 48 వేల 444 చొప్పున ఇప్పటి వరకు 1,78,024 మంది రైతుల ఖాతాల్లో రూ. 165 కోట్ల 35 లక్షల 75 వేల 397 జమ చేసినట్లు వెల్లడించారు. కాగా, జిల్లాకు చెందిన 2,10,904 మంది రైతులకు రూ. 211 కోట్ల 90 లక్షల 69 వేల 841 మంజూరైనట్లు డీఏవో తెలిపారు.

వసతి గృహాలకు సరుకుల సరఫరా టెండర్ ఖరారు

కలెక్టరేట్, జూన్ 20 : ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో సరుకులు, కూరగాయలు, తదితరాల సరఫరాకు సంబంధించి దాఖలైన టెండర్లను శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సమక్షంలో పరిశీలించారు. తక్కువ ధరకు కొటేషన్ దాఖలు చేసిన గుత్తేదారులకు కాంట్రాక్టు ఖరారు చేశారు. జిల్లాలోని 31 ఎస్సీ సంక్షేమ వసతిగృహాలకు వివిధ రకాల ఆహార దినుసులు, సరుకులు, పండ్లు, కూరగాయలు, మాంసం వంటివి సరఫరా చేసేందుకు గానూ ఈ టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ నాగలేశ్వర్, సబిత తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కోసం ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి

ముకరంపుర, జూన్ 20: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో మాదిరిగానే విద్యుత్ సంస్థలో 1999 నుంచి 2004 సంవత్సరం వరకు చేరిన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ (జీపీఎఫ్)ను వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాయిని అంజయ్య, భాస్కర్, శ్రీనివాస్, సంపత్, కొలుపుల రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, అరవింద్ రెడ్డి, శ్రీనివాస్, వీరయ్య, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

తెలంగాణచౌక్, జూన్ 20: ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సంపత్ ఆరోపించారు. నగరంలోని యూనియన్ కార్యాలయం ముకుందలాల్ మిశ్ర భవనంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని పునరుద్ధరించాలని వినతి

శంకరపట్నం, జూన్ 20: గతంలో ఉన్నట్లు తమ సింగిల్ విండో సొసైటీని పునరుద్ధరించాలని మొలంగూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆ గ్రామ రైతులు శుక్రవారం ఈ మేరకు డీసీవో రామానుజాచార్యులుకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మెట్‌పల్లి సింగిల్ విండో పరిధిలోని మొలంగూర్ మొలంగూర్ ఉప కార్యాలయంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం ఉత్సవాల ప్రత్యేక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మొలంగూర్ రైతులు మాట్లాడుతూ.. మొలంగూర్ సింగిల్ విండోను 2005లో మెట్‌పల్లి సింగిల్ విండోలో విలీనం చేయడంతో దూర భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అధికారి దృష్టికి తెచ్చారు. తిరిగి మొలంగూర్ విండోను వేరు చేసి ఆయా గ్రామాల రైతులకు సౌలభ్యం ఉండేలా చూడాలని కోరారు. సభలో చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి, డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

గొర్రెల మేత కోసం ప్రభుత్వం భూమిని కేటాయించాలి

శంకరపట్నం, జూన్ 20: గొర్రెల మేత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా భూమిని కేటాయించాలని, రోడ్లకు ఇరువైపులా తుమ్మ, సుబాబుల్ చెట్లను పెంచాలని యాదవ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల ఐలేశ్ యాదవ్ కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ సొసైటీలకు ప్రభుత్వ భూములు కేటాయించాలని కోరారు. అలాగే కన్నాపూర్ గ్రామంలో సర్వే నంబర్ 60లోని చెరువు శిఖంలో తుమ్మ చెట్లను తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్ల కొమురయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కేశవేని రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతురాలైన విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

హుజూరాబాద్ రూరల్, జూన్ 20: మండలంలోని సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 2024-25విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ చూపిన కొండి సాహిత్యకు శుక్రవారం దాతల సహకారంతో నగదు ప్రోత్సాహకం అందించారు. పైచదువుల ఖర్చుల కోసం వేద భారతి విద్యాపీఠం, హనుమకొండ స్థాపకుడు కూర్మాచలం వెంకటేశ్వర్లు, ఎంఈవో శ్రీనివాస్‌తో పాటు మరికొంత మంది దాతల నుంచి డబ్బులు పోగు చేసి రూ.50వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు ఉన్నారు.

విద్యుత్ స్తంభం సరిచేయాలని రైతుల నిరసన

గన్నేరువరం, జూన్ 20: కూనవానిపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం విరిగిపోయి తీగలు ఒకదానిపై ఒకటి పడి మోటర్లు కాలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్థానిక రైతులు నిరసన తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి విరిగిన విద్యుత్ స్తంభాన్ని మార్పించాలని డిమాండ్ చేశారు.

వెంకటేశ్వరపల్లి స్కూల్‌లో యోగా డే

శంకరపట్నం, జూన్ 20: మండలంలోని మెట్‌పల్లి పరిధిలోని వెంకటేశ్వరపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం, యోగా గురువు లక్కాకుల కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో వ్యాయామం, యోగాసనాలు ప్రాక్టీస్ చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలి

తెలంగాణచౌక్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని గిద్దె పెరుమాండ్ల ఆలయ మైదానంలో శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్న యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మండల కార్యవాహ కామారపు ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా స్థాయి బాధ్యులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో నగరంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

యోగా తరగతులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 20: యోగా దినోత్సవం సందర్భంగా బొమ్మకల్‌లోని అమర ప్రాణ ప్రకృతి చికిత్సాలయంలో వారం పాటు యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో పాల్గొనే వారు శనివారం ఉదయం 9 గంటల్లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9491285221, 8374999377, 9177145221 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ బూటకం'

వీణవంక, జూన్ 20: మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ బూటకమని సీపీయూ ఎస్ఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రమేశ్ ఆరోపించారు. దేశంలో మావోయిస్టుల పేరుతో కొనసాగుతున్న నరమేధం ఆగిపోవాలని పౌర సమాజం ఎంతగా ఘోషిస్తున్నా, కేంద్రం పెడచెవిన పెట్టి ఎన్‌కౌంటర్ హత్యలు కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లను ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు వర్క్ షాప్

కమాన్‌చౌరస్తా, జూన్ 20 : గుడ్ మైండ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ మెంటల్ వెల్‌నెస్ అవగాహన యాత్ర మొదటి దఫాలో భాగంగా శుక్రవారం ఇంటర్ విద్యార్థులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో 'యూత్ మెంటల్ హెల్త్' వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, నేటి రోజుల్లో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, అలాంటి ఒత్తిడిని ఎలా నివారించాలి, మానసిక సమస్యలను ఎలా గుర్తించాలి, పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలనే విషయాలపై అవగాహనకు ఈ వర్క్‌షాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఫౌండేషన్ నిర్వాహకురాలు సానియా, వైద్య శాఖ అధికారి సనా పాల్గొన్నారు.

ఎస్‌యూలో ఉత్సాహంగా తీజ్ వేడుకలు

కమాన్‌చౌరస్తా, జూన్ 20 : శాతవాహన యూనివర్సిటీలో బంజారా విద్యార్థులు తీజ్ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. మొదటి రోజు పండుగ ప్రారంభోత్సవానికి వీసీ ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ రవి, ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ పద్మావతి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుజాత, అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంప్రదాయ ఆచారాలు, వేడుకలను అందరూ భాగస్వాములై జరుపుకోవడం మంచి విషయమన్నారు. ఇక్కడ విద్యార్థులు రంజిత్ కుమార్, రాజ్ కుమార్, మధులత, శ్రీకాంత్, హర్ష, నరేశ్, శివ, మల్లేశ్, వంశీ, రాహుల్, శంకర్, శ్రీను, ప్రశాంత్, కళ్యాణి, నికిత, అంజలి, దినేశ్, మనీశ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యా వ్యాపారానికి అధికారుల సహకారం'

కమాన్‌చౌరస్తా, జూన్ 20 : జిల్లా వ్యాప్తంగా విద్యాధికారులు ప్రైవేట్ విద్యాసంస్థల యజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, విద్యా వ్యాపారానికి సహకరిస్తున్నారని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఇక్కడ ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, జిల్లా కార్యదర్శి సంద గణేశ్ మాట్లాడుతూ, జిల్లా విద్యాధికారులపై కలెక్టర్ విచారణ కమిటీ ఏర్పాటుకు ఆదేశిస్తే, తప్పిదాలన్నీ బయటకు వస్తాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు రాహుల్, జిల్లా ఉపాధ్యక్షుడు అల్లెపు అభిలాష్, మణి, నాయకులు గణేశ్, కళ్యాణ్, అరుణ్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద, కార్పొరేట్ విధానాలపై పోరాడాలి

తెలంగాణచౌక్, జూన్ 20: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యం చేసి సమరశీల పోరాటాలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయం ముకుందాలాల్ మిశ్రా భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, బీజేపీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను పోరాటాలతో అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్, అశోక్, శంకర్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తీర్థయాత్రకు హుజూరాబాద్ నుంచి స్పెషల్ బస్ సర్వీసు

హుజూరాబాద్ టౌన్, జూన్ 20 : యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, వరంగల్‌లోని భద్రకాళి ఆలయాల సందర్శనకు హుజూరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును నడపనున్నట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న హుజూరాబాద్ డిపో నుంచి ఉదయం 4గంటలకు బయలుదేరి, సాయంత్రం 5 గంటలకు హుజూరాబాద్‌కు చేరుతుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సర్వీస్‌కు టికెట్ ధర పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.600గా నిర్ణయించామని, తాగునీరు, అల్పాహారం సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. అడ్వాన్స్ బుకింగ్ కోసం 9959225924, 9704833971, 9247159535, 9441404841 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

హుజూరాబాద్ టౌన్, జూన్ 20: పట్టణంలోని న్యూ కాకతీయ ఉన్నత పాఠశాలలో గ్లోబల్ షోటోఖాన్ కరాటే డు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో కరాటేలో బెల్ట్ మెరిట్ టెస్టులో విజయం సాధించిన విద్యార్థులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రశంసా పత్రాలను, మెడల్స్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ కరాటే ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ సొల్లు సారయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు కొలిపాక సమ్మయ్య, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షుడు ఖలీద్ హుస్సేన్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల 'పాలంబాట'

గన్నేరువరం, జూన్ 20: మైలారంలో విద్యుత్ అధికారులు రైతులతో కలిసి శుక్రవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల దగ్గర విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోటర్‌లకు కెపాసిటర్లు వాడడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ సమస్యలు ఉంటే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఆంజనేయులు, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE Prnl. DISTRICT JUDGE AT KARIMNAGAR
I.A.No. (265) of 2024
in
A.S. No. (63) of 2022
Between:-
Anumandla Chandra Reddy & others
..Petitioner/appellants
And
Mahankali Komuraiah
...Respondents/respondents
To,
R-3) Anumandla Bhupathi Reddy, S/o Mallaiah, age: 70 years, occp: Agril, R/o. Sitharampur village of Chigurumamidi mandal of Karimnagar district.
Whereas the above named petitioner filed the above petition under Order 39 Rule 1&2 of C.P.C. against you and others.
Take notice that the above case is posted to **1-7-2025** for your appearance and counter if any. Therefore you are required to attend the above said Court on the said date at 10-30 a.m. without fail. Otherwise the matter will be heard in your absence and decided according to law.
// By order of the court //
Sd/- **B. Harshavardhan Reddy,** Advocate Karimnagar. Cell: 81211 44616.

హుజూరాబాద్‌కు ఏటీసీ మంజూరు

హుజూరాబాద్ టౌన్, జూన్ 20: హుజూరాబాద్ నియోజకవర్గానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హుజూరాబాద్ పట్టణంలో ఏటీసీని నిర్మించనున్నట్లు తెలిపింది. కాగా, ఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు వృత్తి నెపుణ్యాలపై శిక్షణ అందించనున్నారు.

వర్షాలు కురువాలని కప్పతల్లి ఆట

హుజూరాబాద్ రూరల్, జూన్ 20: పెద్దపాపయ్యపల్లి గ్రామంలో వర్షాలు కురువాలని శుక్రవారం కప్పతల్లి ఆడారు, రోకలికి కప్పను కట్టి డప్పు చప్పుళ్ల మధ్య వీధుల గండా తిరిగారు. మహిళలు రోకలికి కట్టిన కప్పమీద నీళ్లు పోస్తు వానలు కురువాలని కోరుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కలెక్టరేట్, జూన్ 20 : జిల్లాలో ఈ నెల 26 వరకు నిర్వహించనున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. ఈనెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, చేపడుతున్న ఎన్ఎంబీఏ కార్యక్రమంలో భాగంగా మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల జిల్లా శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పలు రకాల అవగాహన శిబిరాలు నిర్వహిస్తుండగా, ఇందుకు సంబంధించిన సమన్వయ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా చూడాలన్నారు. మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేయాలని, రానున్న రోజుల